# రజతోత్సవం

చేతిలో పత్రిక పట్టుకుని విప్పిన పేజీల వంక చూస్తూ వుండి పోయిన మాస్టారు పెద్ద రైతు రంగయ్య రావడం గమనించలేదు_ శారదా విద్యాలయం రజతోత్సవాలు సూర్యవరంలో జరుపుతున్నారు. విద్యామంత్రి ముఖ్య అతిథిగా వస్తున్నారు. ఎందరో ప్రముఖులు సభలో పాల్గొంటున్నారు. ఎక్కడున్నా సరే స్కూలు అంటే మాస్టారికి ప్రాణం శారదా విద్యాలయం పేరు చూడగానే గుండె వుప్పొంగింది. ఆ ఉత్సవానికి అందరూ ఆహ్వానితులే అని ప్రకటించారు. డబ్బై సంవత్సరాల వయస్సులో బస్సు ప్రయాణం చేయడం మరిచిదేనా అనే సంగతి ఆలోచనకు కూడారాలేదు. వెళ్ళాలని మనసు గట్టిగా కోరుతోంది.

"ఏంటండి మాస్టారూ! అంతలా చూస్తున్నారు? రంగయ్య కంఠం వినితెప్పరిల్లి పత్రిక మడిచితలపైకెత్తి చూశారు.

"రా.........రావయ్యా రంగయ్యా! నీ గురించే అనుకుంటున్నా. సూర్యవరంలో స్కూలు రజతోత్సవాలట వెళ్దామా అనుకుంటున్నా" మనసులోని మాట బయట పెట్టారు.

రంగయ్యకి ఆశ్చర్యం వేసింది.

"మాస్టారూ! మీరనేదేమిటి? ఇక్కణ్నుంచి రెండు గంటలు బస్సులో ప్రయాణం చేస్తారా" అడిగాడు వద్దనే సూచనగా.

"అలా అనుకుంటే ఎలా? ఈ చుట్టుపట్ల అంత పేరున్న స్కూలు మరొకటి లేదు. తెలుసా!! రేపే ఆ వేడుక. మళ్ళీ మళ్ళీ రాదయ్యా.

కళ్ళారా చూడాలని...గొంతు సంతోషంతో నిండి మాట రుద్ధమయింది.

బడి అంటే మాస్టారికున్న అభిమానం రంగయ్యకి తెలుసు మెత్తబడ్డాడు కొంచెం.

"అదికాదు మాస్టారూ! ఈ పల్లె కొచ్చి పదేళ్ళుదాటింది. మా పిల్లలకి నాలుగు అక్షరం ముక్కలొస్తుయంటే ఆపుణ్యం మీదే. ఒంటరిగా ఇక్కడికొచ్చారు. ఈ పల్లెలోని కుటుంబాలన్నీ మీవే అయ్యాయి. అందరికీ పెద్ద దిక్కు మీరే."

"అవన్నీ ఎందుకుగానీ—ఇంతకీ ఏవంటావ్ ?"

"అనేదేవుందండి! ఒక్కరే ఎలావెళ్తారా అని పోనీ వెంట ఎవర్నన్నా పంపమంటారా ?"

"భలేవాడివయ్యా! నాకేం భయం వెంటనే వచ్చేస్తాగా"

"సరేనండి మరి జాగ్రత్తగా వెళ్ళిరండి. అక్కడ ఎక్కడుంటారు ? పోనీ వెనకట కరణంగారింట్లో వుండండి ఒకపూట"

"అక్కడికెళ్ళి పరిస్థితుల్ని బట్టి చూడొచ్చు"

"మంచిదినే నెళ్ళొస్తా మాస్టారూ"

మాస్టారి కళ్ళలో సంతోషం చిందులాడింది. సాయంత్రం ప్రయివేటు కొచ్చిన పిల్లలకి ప్రయాణం గురించి చెప్పారు. పొద్దుటిపూట వచ్చే పిల్లల్ని మర్నాడు రావద్దనికబురు చేశారు.

ఎందుకైనా మంచిదని అవసరం లేకున్నా చేతి సంచిలో ఒక పంచె చొక్కా సర్దుకున్నారు. ఉత్తరీయం మరొకటి అనవసరమనిపించింది. తుండుగుడ్డ మాత్రం పెట్టుకున్నారు.

ఉదయం ఏడు గంటలకి బయలు దేరిన బస్సు తొమ్మిది గంటలకల్లా సూర్యవరం చేరింది కార్యక్రమం పది గంటలకి ప్రయాణం బడలిక తగ్గడం కోసం కొంచెం కాఫీ తాగాలనిపించింది. బస్సుస్టాండు ఎదురుగానే ఉడిపి కాఫీ హోటలుంది. ఊరు పెరిగి క్రమక్రమంగా బస్తీ హంగులు ఏర్పరచుకుంటోంది.

కాఫీ తాగి రిక్షా కోసం ఎదురు చూడ సాగారు. అటువస్తున్న రిక్షా ఆపి "అబ్బీ ఇక్కడ స్కూల్లో సభ జరుగుతుందట అక్కడికొస్తావా?" అడిగారు.

"కూచోండి అయ్యగారూ ! ఒక రూపాయి ఇప్పించండి" తల గుడ్డ తీసి సీటు తుడుస్తూ జవాబిచ్చాడు

ఎండలో నడిచి వెళ్ళడం కష్టమని బేరం చేయకుండా "అలాగే" అని నెమ్మదిగా ఎక్కి కూర్చుంటూ "పోనీ అబ్బి" అన్నారు.

మంత్రిగారికి ప్రముఖులకీ స్వాగత ద్వారాలు అట్టహాసంగా అలంకరించారు. రంగు కాయితాల తోరణాలతో రోడ్డు కళకళలాడు తోంది. స్కూలువైపు జనం గుంపులుగా వెళ్తున్నారు.

స్కూలు ఇంక అంతదూరం వుందనగానే కోలాహలం కనిపించింది. మామిడాకుతోరణాలు షామియానా పూలతో అలంకరణ శోభాయమానంగా కనుల పండువగా వుంది. రిక్షా దిగి డబ్బులిచ్చి స్కూలు గేటు వైపు బయలుదేరారు మాస్టారు మంత్రిగారు ప్రముఖులు వచ్చినట్లులేదు. గేటు దగ్గర "శారదా విద్యాలయం రజతోత్సవాలు" అనే బ్యానర్‌ని మనోహరంగా తీర్చిదిద్దారు, వలంటీర్లు బ్యాడ్జిలు పెట్టుకుని

హడావుడిగా తిరుగుతున్నారు. గేటు దగ్గర ఆహ్వానితులు పత్రాలు చూపించి లోపల షామియానాలోకి వెళ్తున్నారు. పోలీసు బందోబస్తు దిట్టంగావుంది.

పదిగంటలు కావచ్చింది........పోలీసుల విజిల్సు హోరెత్తాయి. మంత్రిగారు ప్రముఖులు వస్తున్నట్టున్నారు. అందరినీ పక్కలకు నెట్టే స్తున్నారు. కార్లు బారుగేటు దగ్గరికొచ్చింది. జనం వాటి దగ్గరికి ఎగబడు తున్నారు. పోలీసులు వాళ్ళని నిర్దాక్షిణ్యంగా దూరంగా తోసేశారు. మాస్టారు ఈ సందట్లో నలిగి ఎలాగో కిందపడకుండా నిలదొక్కుకు న్నారు.

మంత్రిగారు ప్రముఖులు లోపలికివెళ్ళారు. వాళ్ళ వెంట కొందరు. బిలబిలమంటూ లోపలికి తోసుకెళ్ళారు. ఎలాగో మాస్టారు గేటు దగ్గరికి రాగలిగారు. అక్కడున్న వలంటీర్లు ఇన్విటేషన్ చూపించమని గద్దిం చారు. "లేదు బాబు! నేను కొత్తపేట నుంచి వచ్చా" అని బతిమాలు తున్నట్టు చెప్పారు.

"ఎక్కణ్నుంచి వస్తే ఎవడిక్కావాలయ్యా పక్కకి తప్పుకో- అని భుజం పట్టుకొని తోసేడు పక్కకి కార్డులున్న వాళ్ళని లోపలికి పంపుతూ—ముందుకు పడికుండా ఆపుకుని మళ్ళీగేటు దగ్గరికొచ్చి "చూడు నాయనా! ఈ కార్యక్రమం కోసం ప్రత్యేకంగా వచ్చా పైగా అందరూ ఆహ్వానితులే అన్నారుకదా అని మరీ వచ్చా వెళ్ళనీబాబు నేనూ బడి పంతుల్నే...." అంటూ వినయంగా అర్థించారు. మాస్టారు ఆ ఖ్ర వలంటీరుకి కోపం వచ్చింది. "ఏమిటయ్యా ఒకటే న్యూసెన్సు" చీదరిం చుకున్నాడు.

గేటుకి కొంత దూరంగా మరో పెద్ద మనిషి బ్యాడ్జీతో వుండటం గమనించి మాస్టారు ఆయన్ని వేడుకొంటున్నట్టు "నన్ను లోపలికి వద

లమని చెప్పండి బాబూ ! దూరం నుంచి వచ్చిన వాణ్ణి" అన్నారు చేతులతో సైగచేస్తూ.

పెద్దగడ్డంతో వయోవృద్ధుడుగా కనిపించిన మాస్టారి మీద ఆ పెద్దమనిషికి సదభిప్రాయం జాలి కలిగి "ఆయన్ని లోపలికి రానివ్వు" అని గేటు దగ్గరున్న కుర్రవలంటీరుకి చెప్పాడు.

బ్రతుకు జీవుడా అనుకుని షామియానాలోకి ప్రవేశించారు మాస్టారు సభాకార్యక్రమం ప్రారంభమయింది. ముందు కుర్చీలు నిండిపోయాయి వెనక వరుసలో ఖాళీగా వున్న ఒక కుర్చీలో కూర్చున్నారు మాస్టారు

ప్రార్థన అయ్యాక మంత్రిగారికి ప్రముఖులకు పూలదండలు వేశారు. అధ్యక్ష ప్రసంగం తర్వాత మంత్రిగారు జ్యోతి వెలిగించారు. దాని ప్రక్కనే వున్న ఫోటోకి పుష్పహారం వేసి నమస్కరించారు వెనక వరుసల్లో జనంపైకి లేచి ఫోటో చూసేందుకు ప్రయత్నిస్తున్నారు. వాళ్ళ వెనుక వున్న జనం "కూర్చోండి" అని అరుస్తున్నారు.

కుతూహలం కొద్దే మాస్టారు కూడా మెల్లగాలేచారు ఆ ఫోటో కనిపిస్తుందేమోనని వెనక వున్నవాళ్ళు "ముసలాడివి ఇంతదూరం నుంచి ఏం కనిపిస్తుందయ్యా కూర్చో... కూర్చో" అని మందలింపుగా చెప్పారు

"ఎవరిదీబాబూ ! ఆఫోటో ?" పక్కనున్న ఆయన్ని అడిగారు మాస్టారు కుతూహలం పట్టలేక.

విద్యాలయం పాలక వర్గం కార్యదర్శి నివేదిక సమర్పించ బోతున్నాడు. పక్కనున్న ఆయనకి ప్రశ్నతో విసుగు పుట్టి నీదీ నాదీ కాదు....ఎవరిదో మనకెందుకు అని జవాబిచ్చాడు.

చిన్నబుచ్చుకుని మాస్టారు వూరుకున్నారు కార్యదర్శి ప్రసంగిస్తూ “ఈనాటి మహాసభకూ ముఖ్యకారకులూ అసలు ఈవూరికి మొట్ట మొదట విద్యాదానం చేసిన మహనీయుడు ఆయనే ఆ చిత్రపటానికి గౌరవనీయులైన మంత్రిగారు ఇప్పుడే పుష్పహారం వేశారు. పాతికేళ్ళ క్రితం ఇదే చోట ఆయన సొంత యింటిని విద్యాలయం కోసం ఇచ్చారు అంతకు ముందు తన యింటిలో బడినడిపి పిల్లలకు విద్య నేర్పారు. ఆయన కోరిక ప్రకారం ఈ స్కూలుకి “శారద విద్యాలయం” అని అప్పుడే పేరు పెట్టారు. ప్రారంభమైన కొంత కాలం దీనికి ఆయనే హెడ్మాస్టరుగా వున్నారు. వేరే యింటిలో అద్దెకుంటూ దీనిని విద్యాలయం కోసం యిచ్చి వేసిన త్యాగధనుడు.

మాస్టారు చెవులు రిక్కించి ప్రతిమాటా శ్రద్ధగా వింటున్నారు.

కార్యదర్శి ప్రసంగం కొనసాగిస్తూ “మహాశయులారా! ప్రయిమరీ స్కూలు తరగతులు పెరిగి మిడిల్ స్కూలు కావడంతో ఉన్నత విద్యార్హతలున్న ఉపాధ్యాయులు కావలసి వచ్చారు. కొత్త హెడ్మాస్టారు వచ్చారు. ఉద్యోగ విరమణ తరువాత మహనీయుడు అప్పయ్య పంతులుగారు ఆయన ఈ వూరువిడిచి వెళ్ళిపోయారు. ఆయన ఎక్కడున్నారో తెలియదు ఎంతో ప్రయత్నించాం లాభం లేకపోయింది.

మాస్టారు ఎందుకో వుద్రేక పడుతున్నారు. లేద్దామా వద్దా అన్నట్లు సీట్లో కదులుతున్నారు.

కార్యదర్శి మళ్ళీ అందుకుని “నా నివేదిక చదివే ముందు ఒక్క సత్యం మనవి చేయక తప్పదు. ఈనాడు ఈ విద్యాలయం యిలా వుండేందుకు ఎంతో శ్రమించాం. కొందరు ఘరానా పెద్దమనుషులు పంతులు గారు వెళ్ళి పోయాక ఈ యింటినీ స్థలాన్నీ స్వాహా చేయాలని విశ్వ

ప్రయత్నం చేశారు. వారి ఆటలు సాగలేదు. స్కూలు పేరు మార్చి తమ పెద్దలు పేరు పెట్టాలని ఎన్నో ఎత్తులు వేశారు. కాని పంతులు గారి సంకల్ప బలంవల్ల అవన్నీ వమ్ముకాక తప్పలేదు. ఆ మహాను భావుడు అప్పయ్య పంతులు గారికి మనం ఎంతో ఋణపడి వున్నాం. నాతో అందరూ ఒక్కసారి కంఠం కలపండి-అప్పయ్య పంతులుగారికి జై-" దిక్కులు పిక్కటిల్లేటట్లు అన్ని కంఠాలు మారు పలికాయి.

మంత్రిగారూ, ప్రముఖులూ యావన్మందీ తమ ప్రసంగాలలో అప్పయ్య పంతులు గారివదాన్యతను కొనియాడారు! ఆ పేరు వుచ్చరించినప్పుడల్లా మాస్టారు ప్రతిస్పందించేవారు. కొన్ని సార్లు లేవబోయి ఆగిపోయారు పక్కనున్న వాళ్ళకి ప్రవర్తన వింతగా తోచింది

రజతోత్సవ సభ జయప్రదంగా జరిగింది. వందన సమర్పణ అవుతుండగానే జనం లేచివెళ్ళిపోవడం మొదలు పెట్టారు మాస్టారు మాత్రం సీట్లోంచి కదల్లేదు. మంత్రిగారూ, ప్రముఖులూ వెళ్ళిపోయారు కార్యకర్తలు మాత్రం మిగిలారు.

మాస్టారు లేచి షామియానాలో ముందుభాగంలోకి వెళ్ళారు. లోపలి కొచ్చేందుకు సిఫారసు చేసిన పెద్ద మనిషి అక్కడుండడం గమనించి మాస్టారు ఆయన దగ్గరకెళ్ళి "బాబూ! ఈ మహోత్సవం కళ్ళారా చూసే అదృష్టం కలిగించావ్. కలకాలం వర్ధిల్లు" అని దీవించారు.

పెద్ద మనిషి ఈ మాటలకు చలించి "అదేం పెద్ద సహాయం. పెద్దవారు మీరు రావడం విశేషం కదా! కుర్రకారుకి తెలియదు. ఇన్విటేషన్ అడిగితే కొంత జనాన్ని అపు చేయవచ్చునని అలా చేశారు. ఏమీ అనుకోకండి.

"పర్వాలేదు నాయనా. మీరు అనుమతిస్తే ఒక్కసారి ఆ ఫోటో చూసి వస్తా బాబూ! విద్యాలయం కూడా ఒక్కసారి చూసి వస్తా" ప్రాధేయపూర్వకంగా కోరాడు.

"తప్పకుండా చూడండి. నేనే దగ్గరుండి చూపేవాణ్ణి. పనులున్నాయి. అని ఇంకో వలంటీర్‌ని పిలిచి "ఈయనకు ఒకసారి స్కూలు చూపించు" అని పురమాయించి వేరే పనికోసం వెళ్ళాడు.

మాస్టారు ఆ ఫోటో దగ్గరికెళ్ళి నిశూగా చూశారు. గుండెలోని ఆనందం ముఖంలో ప్రతిబింబించింది.

"బాబూ! ఈ అప్పయ్య పంతులు ఎవరు నాయనా!" ఉత్సుకతతో అడిగారు మాస్టారు.

స్కూలు చూపెడుతూ ఆ వలంటీరు చెప్పసాగాడు "ఆయన చాల గొప్పవాడు తాను పేదవాడైనా బడికోసం ఇంటినీ స్థలాన్ని దానం చేసిన మహానుభావుడు. ఎక్కడుందీ, అసలు వున్నదీ లేనిదీ తెలియదు. ఈ ఊళ్ళో ఆయన పేరు చెబితే చాలు చేతులెత్తి నమస్కరిస్తారు. అంత గౌరవం. పెద్దలు చెబుతారు. ఒక కూతురట. అకస్మికంగా మరణించిందట జ్వరం వచ్చి. ఆ దిగులులో మంచం పట్టి భార్య కూడా చనిపోయిందట. అయినా పాఠాలు చెప్పడం మానలేదట. పంతులు గారు వేరే హెడ్మాస్టరు వచ్చాక వెళ్ళిపోయారట. పదేళ్ళు దాటిందట. ఎక్కడుంటున్నారో తెలియదు.

"అలాగా బాబూ! చాల సంతోషం. అప్పయ్యగారు, ధన్యజీవి. మనిషికి అంతకంటె ఏం కావాలి మీకు శ్రమిస్తున్నాను బాబూ! పెద్దవాణ్ణి ఏమీ అనుకోకు నాయనా నా మనవడిలాంటి వాడివి.

"నే శ్రమపడిందెక్కడండి. ఈ మాత్రం దానికేనా. ఇంతకీ మీ పేరు చెప్పారు కాదు. అప్పయ్యగారు మీకు తెలుసా"

"కొత్తపేటవైపు వెళ్ళే బస్సులుంటాయా యిప్పుడు" మాట దాటేస్తూ అడిగారు.

"ఉన్నాయండి. రైటయింది. మరి మీ భోజనం? తర్వాత వెళ్ళొచ్చు నెమ్మదిగా. ఈ పూట వుండండి."

"పెద్దవాణ్ణి. రెండు అరటి పళ్ళు తింటే సరిపోతుంది. నేవెళ్ళా. వెంటనే వెళ్ళిపోవాలి" "బస్సుస్టాండు వరకు దింపుతా" పెద్దవారు.

"అక్కర్లేదు బాబూ. రిక్షాలో వెళ్తా.

"నేను వస్తాను. మా వైస్ ప్రెసిడెంటుగారు మరీ చెప్పారు.

ఇద్దరూ బస్సుస్టాండు చేరారు. బస్సు సిద్ధంగా వుంది. మాస్టారిని ఎక్కించాడు వలంటీరు, నాలుగు అరటి పళ్ళుకొని చేతులో పెట్టి నమస్కరించాడు.

"ఇందాక మీ పేరు అడిగినా చెప్పలేదు. జాగర్తగా వెళ్ళి రండి."

బస్సు కదలబోతోంది.

"చెబుతా నాయనా. నాపేరు అప్పయ్యపంతులు."

వలంటీరు దిగ్భ్రాంతి చెందాడు. బస్సు కదిలిపోయింది.